# తేనెకుండలో ఈగ

**జానకమ్మ ఆటోదిగి ఇంట్లో కొస్తూంటే బాలబ్రహ్మం మనసు బ్రహ్మపుత్రానదిలా పొంగింది. యాభయ్యారో యేట పదహారేళ్ళ కుర్రాడిలా ఎదురెళ్ళి భార్య చేతులోంచి సూటుకేసందుకున్నాడు. ఆవిడ గడపదాటింది.**

"బాగున్నావా జానకీ!" అంటూంటే కాళ్ళక్కడే ఆగాయి.

"ఏమండీ...! మీ ఆరోగ్యం బావుందా?" ఆవిడ కాళ్ళకూ బ్రేకులు పడినై.

ఇన్నాళ్ళ ఎడబాటుతో ఎండల్లో ఎడారిగా మారిన గుండెకు జానకమ్మ పలకరింపు రోహిణి కార్తిలో తొలకరి చినుకులా తాకింది.

కళ్ళూ కళ్ళూ కలుసుకుని కలెబడుతున్నాయి. హృదయ నేత్రాలు టపటప లాడుతున్నాయి.

భార్యను కొత్తగా చూస్తున్నట్టుంది... పూర్తిగా మాగి ముడతలు పొడసూపిన మామిడి పండు మొహం. అనుభవజ్ఞుడైన చిత్రకారుడు తీర్చిదిద్దిన కనుబొమ్మల మధ్య రూపాయి కాసంతబొట్టు.

బొట్టును మెరిపిస్తున్న ఒంటిరాయి ముక్కుపుడక, శివలింగాన్ని చుట్టేసిన నాగరాజు లా కొప్పును చుట్టేసిన పూలదండ...

ముప్పయ్యైదేళ్ళ క్రితం తన జీవితాన్ని పెనవేసుకున్న ఈవిడ ఆకారం తప్ప, అలరించే చూపులో మార్పు లేదు." ఏమిటా చూపులూ! నన్నిప్పుడే కొత్తగా చూస్తున్నారా?" ముంచుకొస్తున్న సిగ్గుల్ని పెదాలకు పరిమితం చేసి గబగబా లోపలికొచ్చేసింది.

ఆ నవ్వు విబబూసిన పద్మ సౌందర్యాన్ని తలదన్నేట్టుంది.

"మనమ్మాయి వనమాలా, అల్లుడూ, మనవరాలూ బాగున్నారా?" వెంటనడుస్తూ అడిగాడు.

"అంతా బావున్నారు. రాత్రంతా ప్రయాణం గదా... ఒళ్ళు హూనమై పోయిందనుకోండి." అంటూ బాత్రూంలో చొరబడింది.

గుమ్మంలోంచి వరండాలోకి చొచ్చుకొస్తున్న బాల భానుని నునులేత కిరణాలను పడక్కుర్చీలోంచే చూస్తుండి పోయాడు.

అసలూ... మనిషి జీవనపరమార్థమేమిటీ? కష్టసుఖాలనేవి కావడికుండలు సరేగాని... తాననుభవిస్తుంది కష్టమా? సుఖమా?

కంకరదేలిన రోడ్డుమీద ఒంటెద్దుబండి ప్రయాణంలా బాల్యమంతా సవతి తల్లి ఈ సడింపుల్తో గడిచింది. ఉద్యోగం దొరగ్గానే పెళ్ళైంది. తండ్రి ద్వారా సంక్రమించిన అప్పుల కుప్పుల నరగదీసేందుకు పదేళ్ళపాటు పచ్చడి మెత్తుకుల్తో గడపాల్సి వచ్చింది. అప్పటికే ముగ్గురు పిల్లలు ముద్దులు పంచిస్తున్నారు.

"మన పిల్లల భవిష్యత్తు బంగారం కావాలంటే వాళ్ళను బాగా చదివించాలండీ!" అంది జానకి ఆశల్ని కళ్ళల్లో నింపుకుని.

"ఔను! తాత ముత్తాతలు సంపాదించిన ఆస్తులేవీ లేవు వాళ్ళకు పంచి ఇచ్చేందుకు, మన పిల్లలు మంచి చదువులు చదివి పైకి రావాలి. అది మనకో పరీక్ష." అన్నాడు.

పరిస్థితి ఛాలెంజ్‌గా తయారైంది. ప్రైవేట్‌స్కూల్లో పిల్లల చదువుల డొనేషన్లకూ, ఫీజుకూ, డ్రెస్సులకూ, పిక్నిక్కులకూ... సగం జీతం సమర్పయామి. రోజులు గడవాలంటే ఆర్థిక క్రమశిక్షణ అత్యావశ్యమైంది.

తోటి ఉద్యోగులు డెకోలం మంచాలు, టీ.వీ. ఎయిర్‌కూలర్, మిక్సి వగైరాలు కొంటూంటే మనసనే గుఱ్ఱానికి కళ్ళెం వేసి రేడియోతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

రోజూ ఉదయం, సాయంత్రాలు పిల్లలకు పాఠాలు చెప్పడం, హోంవర్కు చేయించడంతో గడిచేవి.

పిల్లలు ఫస్ట్‌క్లాసులో పాసవుతూంటే అంతరంగంలో ఆనంద కెరటాలెగసి పడేవి.

పెద్దవాడు రవిచంద్ర డాక్టరయ్యాడు. సదాశివపేటలో సొంత నర్సింగ్ హోం.

చిన్నవాడు ఇంజనీరై నల్లగొండలో నాల్గు చేతులా సంపాదిస్తున్నాడు.

అమ్మాయి వనమాల ఉద్యోగంలో చేరింది. వనపర్తిలో భర్తతో ఉంది.

"మన పిల్లల పెళ్ళిళ్ళయ్యాక ఎక్కడివారక్కడుంటారు. మనం మళ్ళీ చిలకా గోరెంకలమై పోతాం. రిటైర్ కాకముందే తీర్థయాత్రలన్నీ తిరిగి రావచ్చు." అనుకున్నారోసారి.

కాని ఏదీ...! ఎప్పటికప్పుడు ఏదో అవాంతరం అందరి పెళ్ళిళ్ళై ఐదేళ్ళు గడిచినా నోరు కాశీకి వెడదామంటే నొసలు గడపదాటనీయదు. ఆరాటం అయోధ్య చూద్దామంటే అత్యవసరం అవతలికెళ్ళ నివ్వదు.

అటు అమ్మాయికి పెళ్ళవగానే ఇటు పెద్దకొడుకు రవీంద్రకు కొడుకు పుట్టాడు.

అతని భార్య రమాదేవి గూడా డాక్టరే. ఎంత గడుసు పిండాన్నైనా చాకచక్యంతో బయటకు తీసి గండం గట్టెక్కించగల గైనకాలజిస్టు. డాక్టరమ్మ హాస్పిటల్ కెల్తే బాబునెవరు చూడాలి? ముద్దుల మనవడి కోసం జానకి అక్కడే ఉండిపోయింది. సంవత్సరం తర్వాత తిరిగొచ్చింది.

వారం రోజుల్లో నాగేందర్ తండ్రయ్యాడు.

"నాన్నా! పాపకు ఉగ్గుపట్టడం, నీళ్ళు పొయ్యడం మీ కోడలు కలవాటయ్యేదాకా అమ్మ నా దగ్గరే ఉంటుంది." అడిగాడు ఇంజనీరొచ్చి.

"నాకు హోటల్ తిండి పడదాయె ఎట్లరా?"

"అమ్మ అన్ని రోజులు అన్నయ్య దగ్గరుంటే ఎట్లా గడిచింది నాన్నా?" ఫెడేల్మని అడిగేశాడు.

"మనం కాదంటే వాడి గతేం కావాలండీ? కొన్ని రోజులుండి వస్తా" నని బయలుదేరింది.

ఆ తర్వాత కూతురు వనమాల తొలికాన్పు కొచ్చింది. సుఖ ప్రసవమైంది. పాపతో అత్తారింటి కెళ్ళేముందు.

"అమ్మా! నేనూ ఆయనా ఇద్దరం ఆఫీసుల కెళ్ళాక పాపనెవరు చూస్తారే?" అడిగింది!

"మరిక్కడ మీ అమ్మ లేకపోతే, ఓపిక లేని నేను చెయ్యి కాల్చుకోవడం బావుంటుందామ్మా?" గుండె గూటిలో భయం రెక్కలాడించింది.

"మరెట్లా నాన్నా! పాపను ఆఫీసుకు తీసుకెళ్తే బావుంటుందా?"

"ఒంటరి తనం నన్నో దయ్యమై పీడిస్తుంది తల్లీ. ఓ ఆయాను పెట్టుకోండి."

"ఆ... అంతేలే! కొడుకుల మీదున్న ప్రేమ కూతురు మీదుంటుందా?" వనమాల కళ్ళు చెమర్చాయి. భయం కాకి నిర్భయంగా పొడిచి ఎగిరిపోయింది.

"ఎంత మాటన్నావమ్మా! నేను నీ కన్న తండ్రిని తల్లీ!"

"నిజమే నాన్నా! అన్నయ్యల దగ్గర అన్ని రోజులుంది అమ్మ. మరి నా దగ్గరుండ గూడదా? నేను నీ కన్న కూతుర్ను నాన్నా!"

"అబ్బబ్బా! అవన్నీ ఎందుకూ? నేనొస్తా పదమ్మా!" ఆవేదనంతా అదుక్కుతొక్కి వెళ్ళింది జానకి. అక్కడో సంవత్సరం గడిచింది.

హమ్మయ్య... ఇప్పుడొచ్చేసింది గదా! హోటల్ పీడా విరగడైంది. ఇంటి భోజనంతో కుదురుగ్గా ఉండొచ్చిహ.

కాశీయాత్రకు ప్లాన్ వెయ్యాలి. హ... గుండెలనిండా ఊపిరి పీల్చుకు న్నాడు.

"ఆఫీసుకు టైమైపోతుంది లేవండిహ!...."

భుజాలు పట్టి కుదిపింది జానకమ్మ. భార్యను అపాదమస్తకం తడుముతున్నాయతని చూపులు.... తలంటు స్నానం చేసి కురులు విరబోసుకుంది.

తడి వెంట్రుకల్లోంచి జారిన నీటి బిందువులు ముత్యాల్లా రాల్తున్నాయి.

సూర్యకణాలు పెదాలమీద కెంపులై మెరుస్తున్నాయి. చెవుల కమ్మలు తళుక్కుమంటున్నాయి.

"ఏమిటా చూపులూ! కదలండీ!" గుండెలోంచి తోసుకొచ్చిన నవ్వు గొంతులో గంతులేసింది.

చూపులు ఎక్స్‌రేలై భర్తను పైనుండి కిందిదాకా పరిశీలిస్తున్నాయి. నవ్వు బాధగా మారింది.

"మీరు చాలా చిక్కిపోయారు సుమా! రోజూ సమయానికి భోంచేస్తున్నారా?"

"ఇంత పెద్దటౌన్లో అనురాగానికి కరువు గానీ అన్నానికి కరువా?" లేచి, చేతులు చాచి గుండెలకు హత్తుకున్నాడు.

ఓహ్! కొన్ని జన్మల అలసట తీరిపోతూంది. కొన్ని క్షణాలలాగే గడిచాయి.

"అంటే... మీకు హోటల్ భోజనమే దక్కిందన్న మాట." పొత్తి కడుపులో బయలుదేరిన అర్ధ్రత గుండెల్ని తడిమింది. పైకి ఎగబాకి కళ్ళల్లో కదిలింది.

"ఔను జానకీ!" భార్యను ఎదురు కుర్చీలో కూచోబెట్టి తానో కుర్చీలో కూచున్నాడు.

ఒక్క పూట వంట ఓ అశ్వమేధయాగంలా గన్పించింది. ఇహ హోటల్ తిండి నా శక్తినంతా తినేస్తుంది." వంకర్లు బోతున్న అతని నుదుటిగీతలు జానకమ్మ ఎదలో వాతలు పెడుతున్నాయి. కడుపులో చల్లచేసినట్లైంది.

"పాపిష్టిదాన్ని... మీకామాత్రం సేవలందించ లేకపోతున్నాను." కొంగుతో కళ్ళద్దుకుంది.

"అలాగనకు జానీ! కోడళ్ళ సేవలందుకుంటూ ఖుషీగా గడపాల్సిన నువ్వు కొడుకులకూ, కూతురుకూ సేవలందిస్తున్నావు. నాకంటే నువ్వే ధన్యురాలివి."

జానీ!... జానీ! ఎన్నాళ్ళ తర్వాత మళ్ళీ ఆ తియ్యని సంబోధన!

జానకమ్మ హృదయ కాసారంలో ఆనందతరంగాలు ఎగిసాయి. సంభాళించుకుని.

"వాళ్ళు మన రక్తం పంచుకున్న పిల్లలండీ. వాళ్ళు పిల్లలప్పుడు అట్లా, పెద్దయ్యాక ఇట్లా!.... ఇంకెన్ని రోజులు మనకీ అవస్థ? ఎంతకాలమీ ఎడబాటు?"

"ఇహ అయిపోయింది. గదండీ! ఐనా మన పిల్లలకు మనమీద భక్తి శ్రద్ధలు లేవంటారా?" వంటింట్లోకి దారితీసింది. మట్టెల చప్పుడు లయబద్ధంగా ధ్వనిస్తూంది.

"ఏమో.... మనసేవలు వన్‌వే ట్రాఫిక్‌లాగైపోయినై" భార్యను వెంబడించాడు. ముందు చాయ్ తయారు చేసి అందిస్తూ.

"ఇంకో రెండేళ్ళలో మీరు రిటైరౌతారు. ఆ తర్వాత ఎక్కడికెళ్ళినా మనం కలిసే వెళ్ళొచ్చు." అంటూ గ్యాసు పొయ్యి మీద బియ్యం పెట్టేసింది.

"ఈ వయసులో ఎడబాటు యమలోకాన్నే చూపిస్తుంది. జానీ! మనషులకు వృద్ధాప్యమెందుకిచ్చాడో ఆ దేవుడు!"

"ఆయన పెట్టే పరీక్షల్లో వెరైటీ ఉండాలనీ" నవ్వేసింది. భార్యతో శృతి కలిపాడు.

"ముందు మీరుసాన్నం చేసిరండి." బాత్రూం చూపించింది కళ్ళతో.

తృప్తిగా భోంచేసి ఆఫీసుకు తయారౌతున్నాడు బాలబ్రహ్మం.

"ఫోస్ట్!" కేక విన్పించింది.

జానకమ్మ వెళ్ళి రెండుత్తరాలు పట్టుకొచ్చింది. అటూ ఇటూ తిప్పి, భర్తకందిస్తూ...

"ఇది మన పెద్దాడు, డాక్టరు రాశాడు. ఏది చదవండి." అంది అసక్తిగా.

మెల్లిగా ఉత్తరాన్ని చించాడు.

"నాన్నా! ఈ రోజే వనమాలనుండి ఉత్తరమొచ్చింది. అమ్మ అక్కడికొచ్చిందట గదా! మీ మనుమడు 'తాతయ్యా, నానమ్మా' అంటూ మిమ్మల్ని గుర్తు చేస్తున్నాడు..."

"మా బుజ్జి నాయనే! ఎంతైనా వాడు నా మనవడండీ!" పొంగిపోయింది జానకమ్మ.

"సరే వినూ... మీ కోడలు మళ్ళీ తల్లి కాబోతోంది. మూడోనెలటా. పూర్తిగా బెడ్‌రెస్ట్ కావాలట. ఇది రెండో కాన్పు కాబట్టి అంతా మన బాధ్యతనేగదా!

రమ హాస్పిటల్ మానేసి మంచమెక్కింది. రెస్టు తీసుకుంటుంది. దయచేసి అమ్మను వెంటనే పంపండి నాన్నా!"

బాలబ్రహ్మం తిన్నదంతా నీరైపోయింది, వెన్నుపూసలో ఏదో అలజడి. కుర్చీలో కూలబడ్డాడు.

"ఆ రెండోది మన ఇంజనీర్ రాసింది. అది కూడా చదవండి." అంది నుదిటిమీద తచ్చాడుతున్న శిరోజాలను సవరించుకుంటూ...

"సరే... అమ్మా నాన్నలకు నమస్కారాలు. నాన్నా! అమ్మ మనూరొచ్చిందని ఉత్తరం రాసింది చెల్లి. మీ కోడలు తన చెల్లె పెళ్ళికని పుట్టింటికెళ్ళింది. నెలరోజుల్దాకా రాదట. నేనేమో ఆఫీసు పనితో సతమతమై పోతున్నాను. ఇక్కడి హోటల్ కూడు గడ్డి కంటే అన్యాయం. కాబట్టి ఈ రోజే అమ్మను పంపించండి.

తప్పక పంపిస్తారు కదూ!"

**అమృత్ కిరణ్ పక్షపత్రిక, 01-07-1996**

★ ★ ★ ★

